ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
పార్వతీపురం మన్యం

## జిసిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిసిసి సోప్ యూనిట్ కార్మికులు గురువారం జిసిసి యూనిట్ వద్ద ధర్నాచేశారు. ఈసందర్భగా సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ విజయనగరం సోప్ యూనిట్‌లో సబ్బులు అమ్ముడు పోక ఉత్పత్తి నిలిచిపోయిందని, . డిటర్జెంట్ యూనిట్ కూడా మరమ్మతులు చేయని కారణంగా నడవడం లేదని తెలిపారు.దీంతో ఇక్కడ పనిచేస్తున్న 16 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. జిసిసి యాజమాన్యం సాలూరు, పార్వతీపురం జెసిసి డిపోల వద్దకు కార్మికులను బదిలీ చేయడంతో మరింత ఇబ్బందులు పెరిగాయన్నారు. నెల జీతం రాను పోను ఛార్జీలకు, సాధారణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదన్నారు. స్థానికంగానే పని కల్పించాలని అడిగితే కార్మికులనే స్టాల్స్ ఏర్పాటు చేసుకొని జిసిసి ఉత్పత్తులను అమ్మాలని యాజమాన్యం చెబుతోందన్నారు. ఫ్యాక్టరీ నడిచేంతవరకు లే ఆఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు సంతు, రమణమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

# అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన

## తొలగింపు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పదేళ్ల సర్వీసు లోబడిన ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. పనికి తగ్గవేతనాలు మంజూరు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏరుదాటాక తెప్పతగలబెట్టిన చందంగా వ్యవహరిస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో పదేళ్లలోపు సర్వీసు గల ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులు కేవలం ఆ విభాగానికి మాత్రమే పరిమితం కాదని, భవిష్యత్తులో అన్ని శాఖలు, ప్రాజెక్టుల్లోనూ అమలు చేసే ప్రమాదం లేకపోలేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యారోగ్యం, రెవెన్యూ, ట్రెజరీ తదితర ప్రభుత్వ శాఖలు, ఎపిఇపిడిసిఎల్, డ్వామా, సమగ్ర శిక్ష వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో సుమారు 5వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా తమను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈలోపు పనికి తగ్గవేతనం అమలు చేయాలని చాలా కాలంగా పోరాడుతున్నారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో పనికి తగ్గవేతనాలు ఇస్తామని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వేతనాలు మొక్కుబడిగా పెంచారు. మూడు కేటగిరిల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వ హయాంలో 8వేల వేతనం పెంచితే, ఈ ప్రభుత్వం రూ.2,700 నుంచి రూ.3వేల లోపే పెంచింది. మరోవైపు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తెల్లరేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకూ దూరం చేసింది. ఈ సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో తాజాగా సర్కారు చేసిన నిర్ణయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులనూ కలవరపాటుకు గురిచేస్తోంది. మరోవైపు తొలగింపు ఉత్తర్వులపై అధికార పార్టీ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటనలోనూ స్పష్టత లేదని కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు.

### జిఒను రద్దుచేయాలి

వర్కర్స్ అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ తొలగింపుపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దుచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఆ జీవోను రద్దుచేయకుండా ఉద్యోగుల తొలగింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం మోసకారి చర్య. ఉత్తర్వుల్లో ఒకమాట. నోటితో మరో మాట చెప్పడం మాటలు చెప్పడం సరికాదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ భర్తీచేయాలి. లేకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

**- కాంతారావు,**
**కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్,**
**టీచర్ అండ్ వర్కర్స్ జెఎసి జిల్లా చైర్మన్**

### ధాన్యం సేకరణలో జాప్యంపై

# 16న కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా

## విజయవంతం చేయాలని రైతుసంఘాల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ధాన్యం సేకరణలో జాప్యంపై ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద భారీ ధర్నాకు జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. పార్వతీపురం పట్టణంలోని రైతు కూలీ సంఘం కార్యాలయంలో బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం సేకరణలో జాప్యం, రైతుల ఆందోళన, మిల్లర్ల దోపిడీపై చర్చించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేపట్టేకుంటే, రైతులను మిల్లర్లు దోపిడీ చేసే అవకాశం ఉందని సమావేశం అభిప్రాయ పడింది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేపట్టిన తర్వాత రైతు అకౌంట్‌లో 21 రోజుల్లో సొమ్మును జమ చేస్తామని చెబుతున్నప్పటికీ వాస్తవ అనుభవాలు విరుద్ధంగా ఉన్నాయని కమిటీ వెల్లడించింది. కొన్ని సందర్భాల్లో నెలలు గడుస్తున్నా రైతులకు డబ్బులు అందడం లేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వమే ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, ఆ నిధి నుండి రైతు అకౌంట్లో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో డబ్బులను జమ చేయాలని డిమాండ్ చేసింది. ఇ-క్రాప్ నమోదులో తప్పిదాలను కూడా పరిగణలోకి తీసుకొని రైతుల నుంచి ధాన్యం సేకరించాలని డిమాండ్ చేసింది. తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టకుంటే రైతులకు అండగా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కలిసొచ్చే పార్టీలతో కలిపి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. దీని కోసం జిల్లా వ్యాప్తంగా ఉమ్మడిగా ప్రచారం చేయాలని, రైతులను కదిలించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్, జనసేన పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, ముత్యాలు, శ్రీనునాయుడు, సహాయ కార్యదర్శి తోట జీవన, భాస్కర్‌రావు, జి.సూరయ్య, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన రైతుసంఘాల సమన్వయ కమిటీ, రాజకీయ పార్టీల నాయకులు

### ధాన్యం కొనుగోలు ఎక్కడ?

**బాడంగి :** వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం కొంటున్నట్టు ఫొటోలే తప్ప రైతుల దగ్గర పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు ఎక్కడా ప్రారంభించలేదని ఎపి రైతు సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పండించే ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వం గోనె సంచులు ఇచ్చి స్వయంగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బాడంగి మండలం మల్లంపేట, పాల్తేరు గ్రామాల్లో ఆయన రైతులతో మాట్లాడారు. ఒకవైపు వరి చేలు కోసి పొలంలో ఉంచడం వల్ల ఎప్పుడు తుపాను వస్తుందోనని భయంతో రైతులున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోతే వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేస్తామన్నారు.

# తగ్గిన మావోయిస్టుల ప్రభావం

## చైన్ స్నాచింగ్‌పై ప్రత్యేక బృందాలు : డిఐజి ఎస్.హరికృష్ణ

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఎఒబి ప్రాంతాల్లో గతం కంటే ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం తగ్గిందని విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ వెల్లడించారు. అయినా, ఎఒబిలో పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నట్లు తెలిపారు. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్‌స్టేషన్ల పరిశీలనకు ఆయన వచ్చారు. పార్వతీపురంలో ఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించారు. పట్టణ పోలీస్‌స్టేషను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మన్యం జిల్లాలో పి.కోనవలస, బట్టివలస గ్రామాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాదారులపై ఉక్కుపాదం మోపేందుకు ఇతర పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు, ఎపిఎస్‌పి సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇటీవల పట్టణంలో వరుసగా జరుగుతున్న చైన్‌స్నాచింగ్ ఘటనలపై ప్రత్యేక బృందాన్ని రంగంలో దించామని వెల్లడించారు. త్వరలో దొంగలను పట్టుకుంటామన్నారు. కొన్ని జిల్లాల్లో చిల్లంగి, చేతబడులు వంటి అపోహలను ప్రజల్లో తొలగించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాతాలను నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. నూతన జిల్లాలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సిబ్బందిని నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి దిలీప్‌కిరణ్, డిఎస్‌పి ఎ.సుభాష్, సిఐలు ఎన్.శ్రీనివాసరావు, కృష్ణారావు, ఎన్.వి.విజయానంద్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిఐజి హరికృష్ణ

# వెల్‌నెస్ భవన నిర్మాణాలు వేగవంతం

- వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు
- పలు శాఖల ఉన్నతాధికారుల సమీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్

గ్రామాల్లో చేపడుతున్న వెల్‌నెస్ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ టి.కృష్ణబాబు, కమిషనర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర స్థాయి అధికారులు.. ఆరోగ్యం, భూసర్వే, నాడు-నేడు, భవనాల నిర్మాణం, ఉపాధి పనులు, ఎంపిఎఫ్‌సి గోడౌన్ల నిర్మాణం.. అంశాలపై జిల్లా కలెక్టరు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కృష్ణబాబు, జె.నివాస్ సమీక్ష నిర్వహిస్తూ యుక్తవయస్సు బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు అందించాలన్నారు. శిశువులలో బరువు తక్కువ ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం, మందులు అందించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెసి ఆనంద్, డిఆర్ఒ వెంకటరావు, తదితరులు

పాఠశాలలు, నాడు-నేడు పనులకు సంబంధించి విద్యాశాఖ కమిషనరు సురేష్ కుమార్ సమీక్షించారు. ఫేజ్-3లో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు బూట్లు, యూనిఫాం కొలతలను నిర్దేశించిన నమూనాలో సేకరించి, సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష (రీసర్వే)లో భాగంగా మ్యుటేషన్ల పనులు వేగవంతం చేయాలని సిసిఎల్ఎ కమిషనర్ సాయి ప్రసాద్ ఆదేశించారు. రీసర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. వివాదాలు లేని భూరికార్డుల రూపకల్పనకు ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో భూసర్వే పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గడువులోపల రీసర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.

భవనాల నిర్మాణ పనులు పురోగతి, ఉపాధి హామీ, శానిటేషన్ పనులపై పంచాయతీరాజ్ శాఖ కమిషనరు గిరిజా శంకర్ సమీక్ష నిర్వహించారు.

సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు సమీక్ష నిర్వహిస్తూ రాష్ట్రంలో ఫేజ్ - 3 కింద నిర్మించనున్న మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ల లక్ష్యాలను సాధించాలని సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. స్థల సేకరణలో సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త జిల్లాల్లో నిర్మించబోయే బిఎంసి, ఎఎంసి యూనిట్లకు సంబంధించిన స్థలాలను కూడా గుర్తించి వివరాలను సాధ్యమైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. జిల్లాల నుండి వచ్చే సమాచారాన్ని అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతి, లక్ష్యాల సాధన గురించి కలెక్టరు నిశాంత్‌కుమార్ ఉన్నతాధికారులకు వివరించారు.

ఈ సమావేశంలో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ పి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్ కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, డిఇఒ ఎస్.డి.వి.రమణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, ఐసిడిఎస్ పీడీ జి.వరహాలు, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 11న చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వీరఘట్టం

పార్వతీపురంలో వేదాంత జూనియర్‌లో ఈ నెల 11వ తేదీన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.గౌరినాయుడు ఎస్.మహేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

# క్రీడలకు ప్రోత్సాహం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

సిఎం ప్రైజ్ మనీ కప్ ద్వారా ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహనరెడ్డి క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రైజ్ మనీ కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జోనల్ స్థాయి సిఎం ప్రైజ్‌మనీ కప్ బ్యాడ్మింటన్ పోటీలను స్థానిక డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో గురువారం కోలగట్ల ప్రారంభించారు. క్రీడా కారుల వందనాన్ని స్వీకరించారు. ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు తదితర జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన అనంతరం కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని అన్నారు. సిఎం ప్రైజ్‌మనీ కప్ ద్వారా కబడ్డీ, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో జిల్లా స్థాయి, జోనల్ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతోపాటు, మానసిక వికాసం కూడా కలుగుతుందని చెప్పారు. క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, ఉద్యోగాల్లో క్రీడాకారుల కోటాలను కూడా భర్తీ చేస్తూ, క్రీడాప్రతిభ ఉన్నవారికి అన్ని రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రతిభను చూపించి, జిల్లాకు, మన జోన్‌కు మంచిపేరు తేవాలని కోలగట్ల ఆకాంక్షించారు. జగనన్న క్రీడా సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఛీఫ్ కోచ్ అప్పలనాయుడు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి కుసుమ బచ్చన్, సిటీ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్, క్రీడా సంఘాల నాయకులు ఎంబికె, రమణ, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఆడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

# ఉజ్వల భవితకు చదువొక్కటే దారి

## పరీక్ష పాస్ కాలేదని బలవన్మరణాలకు పాల్పడొద్దు ● ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-సాలూరు

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే బాగా చదువుకోవడం ఒక్కటే మార్గమని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.2.8 కోట్ల రూసా నిధులతో నిర్మించిన పిజి కళాశాల, అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు రూ.3.6 కోట్లతో నిర్మించనున్న బాలికల వసతి గృహానికి కూడా ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విద్యార్థి జీవితమంతా వసతిగృహాల్లోనే గడిచిందని చెప్పారు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. క్రమశిక్షణ, అంకితభావంతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించడం సులువవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పిజి కళాశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేశానని వెల్లడించారు. మరిన్ని పిజి కోర్సులు మంజూరయ్యేలా చూస్తానని చెప్పారు. కళాశాలలో బాలికల వసతిగృహాన్ని మంజూరు చేయించానని, కానీ విద్యార్థినులెవరూ చేరకపోవడంతో తేలిపోయిందని తెలిపారు. దూరప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థినులు వసతిగృహంలో ఉంటూ చదువుకోవాలని కోరారు. బాలికలు ఆసక్తి చూపితే మళ్లీ వసతిగృహం మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. కళాశాలలో ఇంకేమైనా సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

**బలవన్మరణాలకు పాల్పడొద్దు**

పరీక్షలు ఉత్తీర్ణత కాలేదనో, మార్కులు తక్కువ వచ్చాయనో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడొద్దని డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. కోటి ఆశలతో పిల్లలను తల్లిదండ్రులు ఎంతో శ్రమించి చదివిస్తారని చెప్పారు. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుతారనే ఆశతో పిల్లలను చదివిస్తారని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చకుండా ఏదో సాకుతో నిరాశ చెంది బలవన్మరణాలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రేమ, దోమ పేరుతో కూడా యువత ఆత్మహత్యలకు పాల్పడడం ఈమధ్య ఎక్కువగా కనిపిస్తోందన్నారు. చావుతో సమస్యలు పరిష్కారం కావన్నారు. ఒకసారి పరీక్ష తప్పితే మళ్లీ రాసి పాస్ కావొచ్చని, తొందరపాటుతో క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థలకు చెడ్డపేరు తీసుకురావొద్దని రాజన్నదొర కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ ఛైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఆర్‌జెడి సి.కృష్ణ, ప్రిన్సిపల్ టి.రాధాకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్ మాధవరావు పాల్గొన్నారు.

# కంట్లో కారం కొట్టి..

## వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

వృద్ధురాలి కంటిలో కారం చల్లి మెడలో ఉన్న పుస్తెలతాడును గుర్తుతెలియని మహిళ అపహరించింది. గురువారం పట్టణంలోని రెండో వార్డులో ఈ సంఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ కథనం ప్రకారం.. పట్టణంలోని రెండో వార్డులో ఉన్న ముద్దువారి వీధికి చెందిన పంతుల కామేశ్వరి అనే వృద్ధురాలి నివాసంలోకి గుర్తు తెలియని మహిళ చొరబడింది. మీ భర్త పెట్టిన ముహూర్తం పేపర్లు ఇవ్వాలని అడిగింది. కామేశ్వరి పేపరు వెతుకుతున్న సమయంలో కంట్లో కారం కొట్టి రెండు తులాల పుస్తెలతాడు, రూ.3 వేల నగదు అపహరించుకుపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ ఫక్రుద్దీన్

### ఎండిఎం కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పాచిపెంట

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిబ్బందికి ఆ సంఘం ఆధ్వర్యాన వినతి అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కార్యదర్శి జి.కళ్యాణి, ఉపాధ్యక్షులు వై.మంగమ్మ, సిఐటియు మండల అధ్యక్షులు టి.ప్రభావతి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ఆలోచన మానుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన బియ్యం, సరుకులు సివిల్ సప్లై ద్వారా పాఠశాలకు అందించాలన్నారు.

వినతి అందిస్తున్న నాయకులు

విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్

## పాఠశాలలను సందర్శించిన సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఆడాలి, కుసిమి పాఠశాలలను సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్ సందర్శించారు. ముందుగా ఆడాలి ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యం గురించి ఆరాతీశారు. కుసిమి పాఠశాలను సందర్శించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు ఎరువులు ఎటువంటివి ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

## గోడౌన్లలో తనిఖీలు

ప్రజాశక్తి- సీతంపేట

జిల్లాలో రైస్ బఫర్ గోడౌన్లు, ఎం.ఎల్.ఎస్ పాయింట్లను ప్రత్యేక బృందం తనిఖీలు నిర్వహించింది. గురువారం భామిని, సీతంపేట మండలాల్లో విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ నారదముని , పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సరఫరా అధికారి కెవిఎల్ఎన్ మూర్తి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఉమామహేశ్వరి సంయుక్తంగా తనిఖీలను నిర్వహించారు. ఇప్పటికే పార్వతీపురం, సూరంపేటలలో తనిఖీలు నిర్వహించారు. రైస్ బఫర్ గోడౌన్లు, ఎం.ఎల్.ఎస్ పాయింట్ల పరిస్థితులపై కమిటీ తనిఖీ నిర్వహించి పౌర సరఫరాల శాఖ కమీషనర్ కు నివేదికలను అందిస్తుందని విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ తెలిపారు. గిడ్డంగులలో పరిశుభ్రత అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బియ్యం నిల్వలు, రికార్డుల పరిశీలించామని వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## తాగునీటి కోసం మహిళల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని అమ్మిగారి కోనేరు ప్రాంతానికి ఆరు రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న కుళాయి వద్ద మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలిపారు. ఆరు రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోతే ఎలా జీవించేదని మహిళలు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు సరఫరా చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయకపోతే మంచినీటి ట్యాంకులతో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

## పరుగు పందెంలో జెఎన్‌టియు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విద్యార్థులు 400 మీటర్ల రిలేలో ప్రతిభ కనబరిచారు. ఈనెల 2,3తేదీలలో జెఎన్‌టియుకె అనుబంధ కళాశాలైన ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ (సూరంపాలెం)లో నిర్వహించిన సెంట్రల్ జోన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ లో జెఎన్‌టియు గురజాడ విజయనగరం విద్యార్థులు 4X400 మీటర్ల రిలేలో బంగారు పతకం సాధించారు. పి. నీరజ్ (మెకానికల్), కె. సుమంత్ (ఇఇఇ), ఎమ్. డెన్సీ సెఫిన్ (ఇసిఇ), పి.పవన్ కుమార్ (సిసిసి), హైజంప్ మహిళల విభాగంలో బి. గాయత్రీ (మెకానికల్) కాంస్య పతకం సాధించారు. వీరిని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీకుమార్, స్పోర్ట్స్ కోర్డినేటర్ ఎ.వి. పాపారావు, పీడీ నాగరాజు అభినందించారు. వారందరికీ క్రీడాదుస్తులను అందజేసారు.

## సిపిఎస్ రద్దు చేసేవరకూ పోరాటం

ప్రజాశక్తి-జామి

సిపిస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉపాధ్యాయులు 2 కిలోమీటర్ల వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసిఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలని, సిపిఎస్ రద్దు తప్ప మరే ప్రత్యామ్నాయం లేదని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా కల్పించిన పెన్షన్‌ను ప్రభుత్వాలు రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, ముఖ్యమంత్రి హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. సిపిస్ రద్దు చేయకపోతే భవిష్యత్ పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రాజారావు, వాసుదేవరావు, రమేష్ నాయుడు, ఎం.తాతం నాయుడు, వెంకటరావు, దేముడు బాబు, అప్పలరాజు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దావాల రమణారావు కోరారు. ఈ సందర్భంగా గురువారం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎ.లక్ష్మణరావు, మండల కార్యదర్శి కాద రాము, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రతినిధి ఎస్.నారాయణరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి.వేణు తదితరులు పాల్గొన్నారు.

## క్లాప్‌మిత్ర బకాయిలు చెల్లింపు

ప్రజాశక్తి-భామిని

బురుజోల పంచాయతీలో ఇద్దరు క్లాప్‌మిత్రలకు నెలకు రూ.6 వేలు చొప్పున ఆర్నెల్ల బకాయిలను చెల్లించినట్లు కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి గురువారం ఇద్దరికీ రూ.72 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడపాన కేశవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మనుమకొండలో జాతీయ గౌరవ దివస్

ప్రజాశక్తి -భామిని

గిరిజన పంచాయతీ మనుమకొండలో ఎపిజివిబి బ్రాంచ్ మేనేజర్ బి.బంగారునాయుడు ఆధ్వర్యంలో గురువారం జన జాతీయ గౌరవ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పించారు. అనంతరం బ్యాంకు అందిస్తున్న సేవలు, అకౌంట్ ఓపెనింగ్, ఆర్‌డి, ఫిక్సిడ్ డిపాజిట్, సామాజిక భద్రత పథకాలు, రుణాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం ఎపిజివిబి క్షేత్ర స్థాయి అధికారి గోపి క్రిష్ణ, బ్యాంకు మిత్ర పి. కిరణ్ పాల్గొన్నారు.

## 15న ద్విచక్ర వాహనాల వేలం

**భామిని :** బత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారా తరలింపు కేసుల్లో సీజ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలను ఈ నెల 15న వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ సీతారాములు తెలిపారు. బత్తిలి స్టేషన్ ఆవరణలో జరిగే వేలం ప్రక్రియలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని చెప్పారు..

## దేవనాపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**సీతంపేట:** మండలంలో దేవనాపురం రైతు భరోసా కేంద్రంలో గురువారం వాసన ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా ఆర్‌డిటి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. సిరి ధాన్యాల పోషకాల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంతో వచ్చే లాభాలు గురించి, తక్కువ పెట్టుబడి అధిక దిగుబడి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీరాశి బాలు పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో రైతు మృతి

**లక్కవరపుకోట :** మండలంలోని పిల్ల అగ్రహారం గ్రామానికి చెందిన రైతు పాముకాటుకు గురై గురువారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి మృతుని సోదరుడు జగన్నదొర తెలిపిన వివరాల ప్రకారం. పిల్లఅగ్రహారానికి చెందిన రైతు కరెడ్ల సత్యం (57) తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో కోసిన వరి చేను కుప్పపెట్టేందుకు భుజంపై వరి కంకులను పట్టుకుని వస్తుండగా అందులో ఉన్న పాము నుదుటిపై కాటేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య జగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎఎస్‌ఐ యువరాజు మృతదేహానికి సవపంచినామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# మక్కువలో టిడిపికి ఇదేం కర్మ..!?

- ఏకతాటిపై లేని శ్రేణులు
- కలుస్తామన్న వారిని కూడా కలవనివ్వని అహం
- దిగువ శ్రేణుల్లో అసహనం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజురోజుకు దయనీయంగా తయారవుతోందని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఏళ్ల తరబడి పార్టీలో చాపకింద నీరులా గ్రూపుల విభేదాలు ఉన్నప్పటికీ ఇటీవలే వాటి పరిస్థితి తారాస్థాయికి చేరుకుంది. గతంలో పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న నాయకులు వేసిన గ్రూపుల బీజం నేటికీ మక్కువ మండలంలో టిడిపిని వీడలేదు. ప్రస్తుత సాలూరు నియోజకవర్గ నాయకత్వం కూడా అదే పంథా కొనసాగిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదని పలువురు పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నారు. మండలంలో పార్టీని ఏకతాటిపై తీసుకొచ్చేందుకు నాయకులెవరూ ప్రయత్నాలు చేయకపోవడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మండల కేంద్రంలో మావుడి ప్రసాద్‌నాయుడు కుటుంబీకులను వదులుకున్న అనంతరం మక్కువలో టిడిపి అడ్రస్ దాదాపు గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు పార్టీకి జవసత్వాలు అందించి, అధికారంలోకి తీసుకొచ్చారు. అయితే కొన్ని కారణాల వల్ల తిరుపతిరావు టిడిపిని వీడి బిజెపిలో చేరారు. పార్టీలో బలమైన నేతగా పేరున్న తిరుపతిరావు మరలా సొంతగూటికి చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్న ఆయన గ్రూపును మాత్రం కలుపుకునే స్థితిలో నియోజకవర్గ నాయకత్వం లేదని ఆ గ్రూపు నేతలు ఆరోపిస్తున్నారు. నీడనిచ్చే వృక్షాన్ని వదిలేసి ఆముదం చెట్టును పట్టుకొని పార్టీ నాయకత్వం సేదతీరుతోందని పలువురు టిడిపి నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి ముందు కార్లు, కుక్కలు ఉన్నవారిని నాయకులుగా చేయడం కంటే మరలా అధికారంలోకి రావాలన్నా, జనంలో బలమున్న వ్యక్తిని నాయకులుగా గుర్తించి పార్టీని నడిపించాలని పలువురు పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా జిల్లా స్థాయి నాయకత్వం దృష్టిసారించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ రమణ

## ఉన్నత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డిఇఒ రమణ పరిశీలించారు. ముందుగా మధ్యాహ్న భోజనాలలో మెనూ అమలును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్ల నిర్వహణ, అదనపు గదుల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు శ్యామసుందర్‌తో కలిసి పాఠశాలలో విద్యార్థుల పాఠవాన్ని పరిశీలిస్తూ ప్రశ్నలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## విపత్తుల నివారణకు తక్షణ స్పందన

### డిఆర్‌ఒ వెంకటరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్

మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటరావు

విపత్తుల నివారణకు తక్షణ స్పందన అవసరమని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అన్నారు. విపత్తుల నిర్వహణ, నివారణపై రాష్ట్ర విపత్తుల యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఆపద మిత్రలకు 12 రోజుల శిక్షణను గురువారం సెయింట్ పాల్ లూథరన్ చర్చి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ తుపానులు, వరదలు, భూకంపాలు, వడదెబ్బ తదితర అంశాలు విపత్తుల కింద వస్తాయని వివరించారు. ఆ సమయంలో చురుకుగా వ్యవహరించి ఆస్తి, ప్రాణనష్టాల నివారణలో అంకిత భావంతో పనిచేయాలని కోరారు. జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఆపద మిత్రలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిపిఒ బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ విపత్తుల సమయంలో, ముందు, అనంతరం తీసుకోవలసిన చర్యలపై చక్కని అవగాహన, ప్రణాళిక ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, ఎంపిడిఒ జావేద్, జిల్లా శిక్షణ మేనేజర్ ఎ.దేముడు, తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలోని కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర క్రియేటివిటీ చైర్‌పర్సన్ ఉష అన్నారు. గురువారం గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్న గుడిదగ్గర అఖిల ప్రజాకళాకారుల సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాకారుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. చింతామణి నాటకంపై నిషేధించడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘ గౌరవ సలహాదారులు ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, సంఘ రాష్ట్ర అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి రౌతు వాసుదేవరావు, గౌరవ అధ్యక్షురాలు, కె.మంగాదేవి, కోశాధికారి మువ్వల వెంకటరమణ కార్యదర్శులు బొంగు భాస్కరరావు, గంటా సూర్యనారాయణ, రౌతు అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు బి.హరిబాబు, రెడ్డి భూషణరావు చింతాడ గోవిందమ్మ పాల్గొన్నారు.

## డ్రగ్ ఆంధ్రా ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రాన్ని డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనిని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ ఆరోపించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పక్కనపెట్టి డ్రగ్స్‌కు బానిసలుగా చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. సమావేశంలో మండల కన్వనర్ కెవి కొండయ్య, టిఎన్ఎస్ఎఫ్ మీడియా కో.ఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, సాయి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మహేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

సీతంపేట.. శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వి.కళావతి

### సర్పంచుల శిక్షణలో ఎమ్మెల్యే వి.కళావతి

ప్రజాశక్తి-సీతంపేట

పంచాయతీల అభివృద్ధికి సరైన ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే వి.కళావతి సర్పంచులకు సూచించారు. సీతంపేట వైటిసిలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పేదరిక నిర్మూలన, వృద్ధుల, బాలికల ప్రణాళిక, అభివృద్ధి ప్రణాళికలను గ్రామసభల ద్వారా రూపొందించి ఆమోదం పొందాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే ముందుగా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. సమన్వయంతో పనిచేస్తే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై దృష్టి సారించాలని కోరారు. నేటి సమాజంలో అభివృద్ధికి పంచాయతీలే ముఖ్యమన్నారు. పంచాయతీల విధులు, నిధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మోహన్ రావు, రాము, ఎంపిడిఒ గీతాంజలి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం :** గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించి పక్కా ప్రణాళిక రూపొందించాలని ఎంపిపి శెట్టి పద్మావతి సూచించారు. స్థానిక వైకెపి కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బందికి ఎంపిడిఒ వి.వి.శివరామప్ప ఆధ్వర్యంలో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాల అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామాలాభివృద్ధికి సరైన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. అనంతరం జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం వైస్ ఎంపిపి అన్నాజీరావు, ఎంఇ ఎన్.సత్యనారాయణ, ఎపిఒ పి.బావాజీ, ఎపిఎం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం.. మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్

**వీరఘట్టం :** గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు దృష్టి పెట్టాలని డిపిఒ బలివాడ సత్యనారాయణ సర్పంచులకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధిపై ఒక ప్రణాళిక వేసుకోవాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి రమణ పాల్గొన్నారు.

# రాజుల పాలనలో అభివృద్ధి ఎక్కడ : టిడిపి

ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాజుల పాలనలో గిరిజనుల బతుకులు దయనీయంగా మారాయని, అభివృద్ధి శూన్యమని టిడిపి సీనియర్ నాయకులు కిల్లక దాసు అన్నారు. మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ పెంగువ, రాయగడ జమ్ము, చాపరాయి బిన్నిడి గ్రామాల్లో ఇదేం కర్మ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా విద్య, వైద్యం, తాగునీరు, రహదారి సౌకర్యాలు మెరుగు పడక గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పన లేక వందలాది మంది గిరిజన యువత నిరుద్యోగులుగా ఉన్నారని తెలిపారు. నిజమైన గిరిజన అభ్యర్థి జగదీశ్వరి రానున్న 2024 ఎన్నికల్లో గెలిపించుకుంటే గిరిజన హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి వీలుంటుందన్నారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇవ్వండి.. అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. గిరిజనులకు ఉండాల్సిన హక్కులు, చట్టాలను కూడా పూర్తిగా నిర్వీర్యం చేసే పనిలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. ఇందులో భాగంగానే నూరు శాతం ఉద్యోగ కల్పన పొందవలసిన గిరిజనులకు వెన్నెముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేశారని, బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి జిఒ 52ను తీసుకొచ్చారని విమర్శించారు. మూడేళ్ల పాలనలో ధరలు పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఇదేం కర్మ.. అంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పింఛన్లు అర్హులకు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. పై గ్రామాల్లో ఇంటింటికి, పొలాల్లో ఉన్న రైతుల వద్దకు వెళ్లి వైసిపి పాలనలో పడుతున్న ఇబ్బందులపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు, ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి ఎ.నరేష్, రాయగడ జమ్ము మాజీ సర్పంచ్ కిల్లక జ్యోతి, నాయకులు టి. ధర్మ, వెంకట్, రమణ ఉన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కళింగ వైశ్యులు

## కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి -భామిని

శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మంలో బరాటం రామశేషు హత్యకు వ్యతిరేకంగా కళింగ వైశ్య సంఘం మన్యం జిల్లా కోశాధికారి ఆధ్వర్యాన భామినిలోని అంబేద్కర్ కూడలిలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. హత్య చేసిన వారిపై చర్యలు తీసుకుని, కళింగ వైశ్యులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని రాజేష్, మండల చైర్మన్ కోరాడ వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో పెద్దిన సన్యాసిరావు, చిన్నారి వెంకటరమణ, కోరాడ కోటి, కోరాడ మహేష్, కోరాడ రవణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

## 'ఇంటికొక గంట' ప్రారంభం

ప్రజాశక్తి-సీతానగరం

పెదబోగిలిలో గురువారం 'ఇంటికొక గంట కేటాయించండి' కార్యక్రమాన్ని ఎంపిడిఒ బి.కృష్ణ మహేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల నిర్మాణంలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. మండల స్థాయిలోనే ఈ కార్యక్రమాన్ని నూతనంగా ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె.తెరీజమ్మ, ఇఒ జి.వెంకట్రావు, డిజిటల్ అసిస్టెంట్ సంతోష్, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాల కొరత

ఆరుబయట స్నానాలు చేస్తున్న వసతిగృహ విద్యార్థులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సంక్షేమ వసతి గృహాలు అసౌకర్యాల నడుమ కొట్టిమిట్టాడుతన్నాయి. విద్యార్థులకు కల్పించాల్సిన కనీస అవసరాలు నీరు, మరుగుదొడ్లు, వసతి వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడం విచారకరం. దీంతో చాలా మంది ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. ఫలితంగా ఆరుబయట కూడా అపారిశుధ్యం తాండవించడంతో జ్వరాల బారిన పడుతున్నారు.

మండలంలోని అలుగోలు, బొప్పడాం, మొయిద బిసి సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కొరత తీవ్రంగా వేధిస్తోంది. అలుగోలు వసతి గృహంలో గదులు చాలాక విద్యార్థులు ఇంకా పాత భవనంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు మరిన్ని కష్టాల పడుతున్నారు. మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహం కూడా సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతుందని చెప్పవచ్చు. వసతి గృహంలో ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ హాజరు వేస్తున్నట్లు, మెనూ కూడా పాటించనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవనం మరమ్మతులకు గురికావడం, కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు చలి కాలం ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతి గృహాన్ని నాడు నేడులో భాగంగా బాగు చేస్తామని చెప్పినా ఇంత వరకూ ఆ పనులు జరగలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పించాలని కోరుతున్నారు.

తలుపులు లేని మరుగుదొడ్లు